# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 25, ఫిబ్రవరి 2026


## బాల్క సుమన్‌కు
# కేటీఆర్ పరామర్శ

✦ దిగజారి రాజకీయాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

✦ ఆదిలాబాద్ జైల్లో సుమన్‌తో మూలాఖత్ అయిన కేటీఆర్

**ఆదిలాబాద్ ప్రతినిధి 24 ఫిబ్రవరి, ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడం, భయపెట్టడం, దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ చేసిందని బీఆర్ఎస్ . వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంగళవారం కేటీఆర్ ఆదిలాబాద్ జైల్లో ఉన్న బాల్క సుమన్‌తో ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా అనేక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన



అరాచకాలను, దుర్మార్గాలను రాష్ట్రం మొత్తం గమనించిందన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి 10 స్థానాలు, మాతో పొత్తులో ఉన్న సిపిఐ పార్టీకి 4 స్థానాలు మొత్తం 14 స్థానాలు వస్తే అధికారం చేజిక్కకుండా కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేసిందని. కేవలం ఏడు స్థానాల్లో గెలిచినా అప్రజాస్వామికంగా ఆ మున్సిపాలిటీని దక్కించుకునే అధికార దాహం, కక్కుర్తి కాంగ్రెస్ పార్టీ చూపించిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు స్థానిక మంత్రి వివేక్ దురాగతాలు, అధికార యంత్రాంగం పూర్తిగా అరాచకంగా ప్రవర్తించి ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేశారని ఆయన ఆరోపించారు. కేవలం అక్కడే కాకుండా అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా రంగారెడ్డిలోని ఇబ్రహీంపట్నం వంటి చోట్ల కూడా ఇదే రకమైన అరాచకాన్ని కాంగ్రెస్ పార్టీ చేసిందని. అయితే క్యాతన్‌పల్లిలో ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా మా 14 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి లొంగకుండా నిలబడితే, బిఆర్ఎస్ పార్టీ మహిళా



కౌన్సిలర్ల మీద కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించి దాడికి దిగినా అక్కడ ఉన్న మంత్రి, ఎంపీ నవ్వుకుంటూ చూశారు కానీ నిలువరించే ప్రయత్నం చేయలేదన్నారు. ఇంత దిగజారుడు రాజకీయం బహుశా దేశ చరిత్రలో ఎక్కడ కూడా జరిగి ఉండదని మిగతా 2లో..

## వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

★ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు

**నస్పూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, విద్య, వైద్య, పోలీస్, మున్సిపల్, విద్యుత్, రవాణా శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ మిగతా 2లో..

## అకాల వర్షానికి..
# నేలమట్టమైన పంటలు

## కన్నీరుమున్నీరవుతున్న రైతన్నలు

**లక్ష్మణచాంద, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాల్లో నిన్న సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించి రైతులు విలవిలలాడుతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, ఉడకబెట్టిన పసుపు పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం.. మండలవ్యాప్తంగా 773 మంది రైతులకు చెందిన సుమారు 1171 ఎకరాల్లో మొక్కజొన్న పంటదెబ్బ తినగా, ఒక్క పీచర గ్రామంలోనే 98 మంది రైతులకు సంబంధించి 125 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గతంలో కురిసిన భారీ వర్షాలకు తోడు, నిన్న రాత్రి కురిసిన వానకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ పరివాహక ప్రాంతాల్లోని పత్తి, సోయాబీన్, పసుపు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా సర్పంచ్ తిప్పని రాజేశ్వర్, దాబా రాకేష్ మాట్లాడుతూ.. అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీటిపాలవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.



## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



✪ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ప్రభాతవార్త:**

జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించిన కలెక్టర్.. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు 23 కేంద్రాల్లో 13,125 మంది విద్యార్థులు, మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు 47 కేంద్రాల్లో 9,758 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వెలుతురు, ఫర్నిచర్, వైద్య శిబిరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ విద్యార్థుల కోసం పరీక్షా సమయాలకు అనుగుణంగా మిగతా 2లో..

# బాల్క సుమన్‌కు కేటీఆర్ పరామర్శ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. మరోవైపు జనగామలో కూడా దళిత మహిళా కౌన్సిలర్‌ను చేయి పట్టి బలవంతంగా గుంజి చిల్లరగా ప్రవర్తించారని విమర్శించారు. అయితే క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అరాచకాలను అధికారుల అక్రమాలను ప్రశ్నిస్తే తమ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో పాటు ఉపాధ్యక్షులు మూల రాజిరెడ్డిని, ఇంకొంతమంది పార్టీ నేతలను అరెస్ట్ చేసి ఆదిలాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారన్నారు. అయితే అరాచకాలను అడ్డుకున్నందుకే తమ పార్టీ నాయకులపైన అక్రమ కేసులు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మరి వారి సొంత పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, బీజేపీ ఎంపీ అరవింద్ అడ్డగోలుగా బూతులు తిట్టిన, బట్టలు ఊడదీసి కొడతా అన్న, ఈడియట్ అంటూ యూజ్ లెస్ ఫెల్లో అంటూ మాట్లాడినా ఎలాంటి కేసులు పెట్టలేదని పోలీసులు అయితే రాష్ట్ర డీజీపీ ఒక పార్టీకి ఒక న్యాయం, కాంగ్రెస్, బీజేపీకి ఇంకో న్యాయం అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ నాయకుల అరాచకాలు డీజీపీకి కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. సుమన్‌ని జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న వాళ్ళకి తాము ఒక్కటే చెబుతున్నామని సుమన్‌కి జైలుకు పోవడం కొత్త ఏమి కాదని, ఉద్యమ కాలంలో అనేక సార్లు జైలుకు పోయాడని, ఆరు నెలలకు పైగా వివిధ సందర్భాల్లో జైల్లో ఉన్నాడని. రేవంత్ రెడ్డి ఈ అక్రమ కేసుతో మా నాయకుడిని భయపెట్టిస్తామంటే ఎవరూ భయపడరన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే ఎంతటివారైనా తప్పకుండా తగిన శిక్షను అనుభవిస్తారని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కూడా పెద్ద పెద్ద సినిమా డైలాగులు కొట్టాడని, రెడ్ బుక్ ఉండదు, పింక్ బుక్ ఉండదు, కాకి బుక్ ఉంటుంది అని. మరి ఈరోజు కాకి బుక్ ఎక్కడికి పోయిందని ఆయన ప్రశ్నించారు. మీ పోలీసులను యూజ్ లెస్ ఫెలో అన్న, బట్టలు ఊడదీసి కొడతా అన్న కేసు ఎందుకు పెట్టడం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి వాళ్లకు ఒక నీతి, ప్రతిపక్షంలో ఉన్న మాకు ఒక నీతి అనేలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుందని. కచ్చితంగా మీ అరాచకాలకు అప్పుడు తగిన శిక్షను అనుభవిస్తారన్నారు. ఈరోజు చట్టాలను, ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రతి ఒక్కరు ఎక్కడున్నా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ఇక ఎలక్షన్ కమిషన్ కూడా ప్రజాస్వామికంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వెంటనే క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లో ఎన్నికలు నిజాయితీగా, పారదర్శకంగా పెట్టాలన్నారు. సీసీ కెమెరాల మధ్య సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు జరగనివ్వాలని, గెలిచిన వాళ్లను ప్రమాణ స్వీకారం చేయనియ్యండని ఆయన కోరారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని. అలాంటి వాళ్ళు అవసరమైతే కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పనిచేయాలన్నారు. మా ఎమ్మెల్యే ఆదివాసీ బిడ్డ కోవ లక్ష్మి పైన కూడా అక్రమంగా కేసు పెట్టారని. ప్రజాస్వామికంగా ప్రజల తీర్పును గౌరవించేలా కాపాడుకోవడమే ఆమె చేసిన తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇలా అడ్డగోలుగా అక్రమ కేసులు పెడుతున్న ప్రతి ఒక్కరూ రానున్న రోజుల్లో శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఈ మొత్తం మున్సిపల్ ఎన్నికల దుర్మార్గాలను ఎలుగెత్తి బయటకు తీసుకువచ్చిన మీడియాకి, సోషల్ మీడియా వారియర్లకు, ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సుమన్, పార్టీ నాయకుల బెయిల్ కోసం న్యాయస్థానాలను బీఆర్ఎస్ పార్టీ లీగల్ న్యాయస్థానాల్లో ప్రభుత్వ అరాచకాలను ఎదిరిస్తున్నదన్నారు. న్యాయ నిపుణులు, మా లీగల్ టీమ్ అంతా ఉన్నారని. మాకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందన్నారు. కోర్టు తప్పకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని నమ్ముతున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా మా మహిళా కౌన్సిలర్ల మీద అసభ్యంగా ప్రవర్తించిన, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పకుండా న్యాయం గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ వెంట ఆదిలాబాద్ ఇన్చార్జి మాజీ మంత్రి జోగు రామన్న. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్ ,కె.పి. వివేకానంద గౌడ్, నాయకులు ప్రశాంత్ రెడ్డి, సంజయ్ కల్వకుంట్ల, గ్యాదరి కిషోర్, గొంగిడి సునీత, జీవన్ రెడ్డి, జాన్సన్ నాయక్, బోథ్ సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, తుల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, మాజీ చైర్మన్ తుంగ బలు సతీశ్, పల్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష ప్రశ్న పత్రాలు తెరిచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రశ్నపత్రాల రవాణాలో పోలీస్ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిబ్బంది, సిసి కెమెరాలు, త్రాగునీరు, మూత్రశాలలు, వెలుతురు సరిపడా ఉండేలా చూసుకోవాలని, ఫర్నిచర్ పరిశీలించుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి మొబైల్ లను అనుమతించడం జరగదని తెలిపారు. క్లాక్ రూమ్, కంట్రోల్ రూమ్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షలు ముగిసిన తర్వాత ఉపాధ్యాయులు వార్షిక పరీక్షలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అల్పాహారం పథకం క్రింద సెంట్రాలైజ్డ్ కిచెన్ ఏర్పాటు కొరకు 21 జిల్లాల నుండి భూ వివరాలు అందించడం జరిగిందని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో భోజన శాలల పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. రాష్ట్ర సరిహద్దులలో గల పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. 10వ తరగతి పరీక్షల కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వార్షిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్.యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా గ్రామీణ పేదల సంఘంపై పోలీసు జులుం!

**- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాల మహేందర్**

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ఖమ్మం జిల్లా వెలుగుమాట్ల గ్రామం నందు గత 12 సంవత్సరాలుగా భూదాన్ భూముల నందు భూమిలేని నిరుపేదలు ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ భూదాన్ భూములకు సంబంధించి హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అధికార పార్టీ యంత్రాంగం, మంత్రులు కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి ఈరోజు ఉదయం పేదల ఇండ్లను కూల్చి వేయడానికి వేల మంది పోలీసులు బలగాలను రంగంలోనికి దింపి అక్కడ నివసించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ జెసిబిలతో పేదలు వేసుకున్న ఇళ్లను నేలమట్టం చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమాట్ల లో జరుగుతున్నటువంటి విషయాలను కవర్ చేయడానికి వెళుతున్న తొలి వెలుగు జర్నలిస్టులను వెళ్లకుండా అడ్డుకోవడం అధికార పార్టీ నాయకుల నీతిమాలిన తనానికి నిదర్శనం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అధికారంలోనికి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పేదల ఇండ్లను కూల్చి వేయడానికి ఈ రోజు కంకణం కట్టుకుంది. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ కు ఖమ్మం జిల్లా వినోబా గ్రామం నందు జరుగుతున్న సంఘటనలు నిదర్శనం. ఇప్పటికైనా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి అక్కడ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ డిమాండ్ చేస్తున్నది. లేనిపక్షంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో జరగబోయే ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని డిమాండ్ చేస్తుంది. అలాగే ఖమ్మం జిల్లా ఇనోవా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది అని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాల మహేందర్ అన్నారు.

# పరీక్షల నిర్వహణలో నిరక్ష్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్టీసీ బస్సులను నడపాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డీఐఈఓ పరుశురాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అందుగులపేట పంచాయతీపై మండల పంచాయతీ అధికారి సమీక్ష

మందమర్రి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామ పంచాయతీని మంగళవారం మండల పంచాయతీ అధికారి ఎం. సత్యనారాయణ సందర్శించి పరిపాలనా అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ పనితీరు, ఆదాయ వనరులు, పారిశుధ్య కార్యక్రమాలు, నర్సరీల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేసి ఈ నెల 25-02-2026 నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లో 100 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్సులను సంబంధిత దుకాణ యజమానులతో మాట్లాడి వెంటనే రెన్యువల్ చేయించాలని సూచించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఐ దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థులు కోరిన సమాచారాన్ని వెంటనే అందజేసి, ఒక ప్రతిని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల లోపు హాజరు నమోదు చేసి వెంటనే డిఎస్ఆర్ నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త లేకుండా పరిశుభ్ర వాతావరణం కల్పించాలని తెలిపారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి 100 శాతం మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి, సంబంధిత బిల్లులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కె. వీరేందర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.z

## సింగరేణిలో బొగ్గు నాణ్యతపై సమీక్ష సమావేశం

**- ఉత్పత్తి-వినియోగదారుల అవసరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

మందమర్రి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త




బొగ్గు నాణ్యత, వినియోగదారుల అవసరాలు, రాబోయే సవాళ్లను అధిగమించే మార్గాలపై మంగళవారం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం మందమర్రి ఇల్లందు క్లబ్‌లో నిర్వహించగా, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన మార్కెటింగ్, క్వాలిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని, బొగ్గు ఉత్పత్తి ప్రమాణాలను మెరుగుపరచడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సరఫరా నిర్వహణపై పలు సూచనలు చేశారు. జి.ఎం క్వాలిటీ కార్పొరేట్ ఏ. రవికుమార్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల వరకు అందరికీ నాణ్యతపై స్పష్టమైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి దశలోనూ నాణ్యత ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో టి. శ్రీనివాస్ జి.ఎం, కో ఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్, కార్పొరేట్, హైదరాబాద్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కె. విజయ భాస్కర్ రెడ్డి, రీజనల్ క్వాలిటీ బెల్లంపల్లి రీజియన్ పి. వీరభద్రరావు, రీజినల్ క్వాలిటీ జనరల్ మేనేజర్ రామగుండం రీజియన్ సుజోయ్ ముజేందర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బొగ్గు నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, మార్కెట్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అంశాలపై చర్చించారు.

# వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు అన్నారు. మంగళవారం రాష్ట సచివాలయం నుండి వార్షిక పరీక్షల నిర్వహణపై కార్యదర్శులు, కమిషనర్లతో సహాఅన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు, విద్యా, వైద్య, ఆర్టిసి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పదో తరగతి వార్షిక పరిక్షలుఉంటాయని, ప్రతీ పరీక్ష కేంద్రంలో త్రాగునీరు, పారిశుద్యం, వెలుతురు, సరిపడా పర్నిచర్ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు, పోలీస్ బందోబస్తు, ప్రశ్న జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మద్య పరిక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులు పరిక్ష సమయానికి ముందే చేరుకునేలా ఆర్టిసి అధికారులు బస్సులు నడపాలన్నారు. అనంతరం సమీకృత కలెక్ట రేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ కె. హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరిక్షల నిర్వహణకు 19 పరిక్షా కేంద్రాలు, పదో తరగతి వార్షిక పరిక్షల నిర్వహణకు 38 పరిక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరిక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించెందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు పరిక్ష సమయానికి ముందే చేరుకునేలా ఆర్టిసి బస్సులు నడిపేల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ పరిక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు, పరిక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్ల మూసివేతకు ఆదేశాలు ఇచ్చమన్నారు. పరిక్షల నిర్వహణలో శాఖ అధికారులు, చీఫ్ సుపరిండెంట్లు, ఇన్విజిలెటర్లకు శిక్షణ యివ్వడం జరిగిందని, సిట్టింగ్, ఫ్లయింగ్ స్కాడ్ బృందాలను నియమించడం జరిగిందని, పరిక్ష కేంద్రాలలో మొబైల్ ఫోన్లు ఎల్లక్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరిక్షలు ప్రశాంతంగా జరిగేల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాధ్యమిక విద్యశాఖ అధికారి రాందాస్, జిల్లా పంచాయతి అధికారి బిక్షపతి, జిల్లా రవాణశాఖ అధికారి రాంచందర్, ఆర్టిసి డిఎం రాజశేఖర్, సంబందిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు




పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిత



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ఎమ్మాజి శారద

## కాపువాడ పోచమ్మ ఆలయ స్థల సేకరణకు వినతి

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

పట్టణంలోని కాపువాడ ప్రాంతంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని కోరుతూ 6వ వార్డ్ కౌన్సిలర్ ఎమ్మాజీ శారదా సంతోష్ కాగజ్‌నగర్ తహశీల్దార్ మధుకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాపువాడ ప్రజల దీర్ఘకాల కోరిక అయిన పోచమ్మ గుడి నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మధుకర్ సమస్యను సానుకూలంగా స్వీకరించి, రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి అనువైన ప్రదేశాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియ పూర్తిచేసి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్ మాట్లాడుతూ, కాపువాడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు పోచమ్మ ఆలయం నిర్మాణం అత్యంత అవసరమని అన్నారు. ప్రజల సహకారంతో త్వరలోనే స్థలం ఖరారు చేసి గుడి నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేస్తామని తెలిపారు. స్థానికులు ఆలయ నిర్మాణం త్వరితగతిన ప్రారంభం కావాలని కోరుతున్నారు.



కౌన్సిల్ సభ్యులను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

## కౌన్సిల్ సభ్యులకు సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్ ,ఫిబ్రవరి 24 , ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ వాకర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో మంగళవారం నూతనంగా ఎన్నుకోబడిన వాకర్స్ అసోసియేషన్ సభ్యుల్లో నాలుగు కౌన్సిల్ సభ్యులను సన్మానించారు. ఈ సందరన్బంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల్లో ఎన్నడూ లేని విధంగా ఒకే సారి నలుగురు కౌన్సిలర్లుగా గెలవడం సంతోషం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్పీయం ఆధ్వర్యంలో 90 మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24 , ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్స్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని రెగులగూడ, ఊట్పల్లి, గ్రామాల మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు, దాదానగర్ పాఠశాల విద్యార్థులకు 90 స్కూల్ బ్యాగుల పంపిణీ చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల భాగంగా స్కూల్ బ్యాగులను పంపిణి చేసినట్లు ఎస్పీయం జీఎం ఎం.ఎస్. గిరి (జీఎం–హెచ్ఆర్ఐఆర్) తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో, పాఠశాలల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ బృందం, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాంతీయ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన బ్యాగులతో విద్యార్థులు

## ఇంటర్ పరీక్షల నిర్వహణకు
# పూర్తి స్థాయి ఏర్పాట్లు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హరిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సవత్సరం పరిక్షలు ఉదయం 9గం. నుండి మద్యాహ్నం 12గం.వరకు ఉంటాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 5504 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 4797 మంది విద్యార్థులు మొత్తంగా 10301 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరిక్షల కోసం 19 పరిక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ కోర్సుకు చెందిన విద్యార్థులు పరిక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరిక్ష కేంద్రం వద్ద బిఎన్ఎస్ 163 చట్టం ప్రకారం 144 సెక్షన్ ఉంటుందని, పరిక్షలు జరిగే సమయాలలో జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసి వుంచేల చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షలను ప్రశాంతంగా జరిగేల అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకోడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.



హాల్‌టికెట్ నెంబర్ వేస్తున్న సిబ్బంది

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..

**కెరమెరి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నేటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సి ఎస్ కే కొండయ్య తెలిపారు మొదటి సంవత్సరంలో 166 ద్వితీయ సంవత్సరం133 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీసీ కెమెరాలు తాగునీరు, విద్యుత్, ఇతర కనీస వసతులను ఏర్పాటు చేశారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థినీ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రం వద్ద హాజరుకావాలని కోరారు



## ఎస్ఎంఏఎం పథకం కింద వ్యవసాయ యంత్రాల పంపిణీ

**రెబ్బెన, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మండలంలో ఎస్ఎంఏఎం పథకం కింద వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు 7 పవర్ స్ప్రేయర్లు, 2 రోటావేటర్లు, 1 కల్టివేటర్ పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్టీఏ సభ్యుడు లావుడ్య రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, రెబ్బెన సర్పంచ్ భరద్వాజ్, గంగాపూర్ సర్పంచ్ వెంకట చారి, వ్యవసాయ విస్తరణ అధికారి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి రైతుల శ్రమ, ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. యంత్రాలు పొందదలచిన రైతులు తమ మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## సిబ్బంది సమయపాలన పాటించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్నిఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిపిఓ వాసుదేవ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమములో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరిత

# 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

జిల్లాలో జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య లతో కలిసి మండల విద్యాధికారులు, ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, రూట్ అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష రోజున పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తరలించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు బయట క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ సంబంధిత వార్తలు ప్రసారమైతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం



లేకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఏమైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, పరీక్షా కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ప్రకారంగా ప్రశ్నాపత్రాలు వెళ్లేలా అధికారులు పర్యవేక్షించాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని, అభ్యర్థులను లోనికి అనుమతించే సమయంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలని తెలిపారు. పరీక్ష సమయం ముగిసే వరకు విద్యార్థులను బయటకు అనుమతించకూడదని సూచించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### - ఎస్వీఈపీ డీపీఎం స్వామి

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని ఎస్వీఈపీ డీపీఎం స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పేద మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతులు 30 రోజుల పాటు కొనసాగుతాయని, శిక్షణ సమయంలో ప్రతిరోజూ పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. మహిళలు నైపుణ్యం సాధించి సొంతంగా ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట్ రెడ్డి, సీసీలు టి. శంకర్ యాదవ్, నవీన్, ఎస్వీఈపీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



## ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు ప్రారంభం

**సారంగాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

మండలంలోని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విధివిధానాలపై శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో సర్పంచులకు, మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. మంగళవారం నుండి శనివారం వరకు మొదటి దశ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల నిర్వహణ, అధికారాలు, బాధ్యతలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీటీఎం శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీఓ అబ్దుల్ అజీజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, శిక్షణ పొందిన టీటీలు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఎస్ఐ శ్రీకాంత్

**సారంగాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు రెండో విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని జాం గ్రామంలో వాహనదారులకు ఎస్ఐ శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత అతివేగంతో ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు శోకం మిగల్చవద్దని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.






## పేదింటి బిడ్డలకు కేసీఆర్ మేనమామ: ఎమ్మెల్యే

**నేరడిగొండ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

పేద బిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ మేనమామలా కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇచ్చోడ మండలానికి చెందిన 110 మందికి, సిరికొండ మండలానికి చెందిన 7 మందికి మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఆలోచించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఎవరూ అడగకపోయినా మానవతా దృక్పథంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగణంలో ఉద్యం నమోదుపై అవగాహన

**నిర్మల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**



మండలం చించోలి(బి) గ్రామంలోని మహిళా ప్రాంగణంలో మంగళవారం ఉద్యం నమోదు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఏఎంపి పథకం ద్వారా ఎంఎస్ఎంఈ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, ఎల్‌డీఎం రామ్ గోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నూతన వ్యాపారవేత్తలకు ఉద్యం నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా బ్యాంకు రుణాలు సులభంగా పొందడం, విద్యుత్, పన్నులపై సబ్సిడీలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, టీప్రైడ్ వంటి పథకాల ద్వారా లభించే ఆర్థిక సహాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ డబ్ల్యూసీడీసీ జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఈజీఎంఎం ప్రతినిధులు సౌమ్య, రమేష్ తదితరులు పాల్గొని నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల గురించి సమాచారం అందించారు.

## ఆంధ్ బిడ్డకు ఐటీడీఏ చైర్మన్ అవకాశం ఇవ్వాలి

### - కాంగ్రెస్ నాయకుల వినతి

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ఉట్నూర్ ఐటీడీఏ చైర్మన్ పదవిని ఆంధ్ తెగకు చెందిన కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్‌కు కేటాయించాలని కోరుతూ మండల నాయకులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాండురంగ్ ఆదివాసీ కుటుంబానికి చెందినవారని, గిరిజనుల సమస్యలు, అడవి హక్కులు, భూ సమస్యలపై ఆయనకు పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆదివాసీ కుల సంఘాల 9 తెగలకు నాయకత్వం వహించిన అనుభవం ఆయనకు ఉందని, పాండురంగ్ వంటి ఆదివాసీ బిడ్డకు ఈ బాధ్యత అప్పగిస్తే ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని అభిప్రాయపడ్డారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆడే గజేందర్ స్పందిస్తూ.. ఈ విషయాన్ని జిల్లా ఇంచార్జ్ మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్ల శివుడు, దేవేందర్, విఠల్, రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ కరిపే రవళి విలాస్

**సారంగాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**



మండలంలోని జాం గ్రామంలో హనుమాన్ టెంపుల్, ఇందిరమ్మ కాలనీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ కరిపే రవళి విలాస్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీవాసులకు నీటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీఎంవో సిహెచ్ లక్ష్మణ్

## విద్యార్థులకు మంచి పోషకాహారం అందించాలి

### - మంచిర్యాల జిల్లా ఏసీఎంవో

**జన్నారం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

బడికి వచ్చే విద్యార్థులకు మంచి పోషకాహారం అందించాలని మంచిర్యాల జిల్లా ఏసిఎంఓ సిహెచ్ లక్ష్మయ్య అన్నారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలోని హాస్టల్ తండా ఆశ్రమ పాఠశాల, కొలాంగూడా లోని టీ డబ్ల్యు పిఎస్ పాఠశాలను మంగళవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అలాగే తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు గురించి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి కృషి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యత గురించి తెలియజేసి పిల్లలను ప్రతిరోజు స్కూలుకు పంపించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు.



## ఆశ్రమాలు ఆధ్యాత్మిక దారిదీపాలు

### - కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

**నేరడిగొండ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఆశ్రమాలు సమాజానికి ఆధ్యాత్మిక దారిదీపాలుగా నిలుస్తాయని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండలంలోని కుప్తి(కే) గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ సద్గురు శ్రీ శబరిమాతాజీ ఆశ్రమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అభివృద్ధికి గజేందర్ గారు అందించిన సహకారాన్ని గుర్తిస్తూ గ్రామస్తులు, ఆశ్రమ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. స్థానికుల విన్నపం మేరకు ఆశ్రమ భవన నిర్మాణానికి స్లాబ్ వేయించడంతో పాటు, ఇతర అభివృద్ధి పనుల్లో అడిగిన వెంటనే స్పందించినందుకు గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలయ్య మహారాజ్, దేవన్న మహారాజ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, శ్రీరామోజీ నారాయణ, షేక్ అలీ, శంకర్ నారాయణ, నాగిరెడ్డి, మురళి గౌడ్, బద్దం పోతారెడ్డి, ఎండీ సద్దాం, మోలానా, ఆశ్రమ భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సంపూర్ణతా అభియాన్ 2.0 ప్రారంభోత్సవం

**తిర్యాని, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

తిర్యాని మండలంలో సంపూర్ణతా అభియాన్ 2.0 ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ మాట్లాడుతూ సంపూర్ణతా అభియాన్ 2.0 పుట్టిన బిడ్డ బరువు, పిహెచ్‌సి, సిహెచ్‌సి పై ప్రత్యేక శ్రద్ధ, అంగన్వాడీలో ఎత్తుల కొలతలు, మరుగుదొడ్ల నిర్వహణ, అంగన్వాడీలు అందించే పౌష్టికాహారాలు, పశువుల టీకాలు, తదితర అంశాలతో ఇండికేటర్లు ఉండనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కలిసి పని చేసినప్పుడే లక్ష్యాలు చేరుకుంటామని పేర్కొన్నారు. గత సంపూర్ణతా అభియాన్ 1.0 లో ఏలా కలిసికట్టుగా పనిచేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామో ఇప్పుడు కూడా ఆ విధంగానే అందరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వాడకాలు పెరిగి గ్రామాలన్ని పరిశుభ్రంగా మారాయని అభినందించారు. సమైక్య సంఘాల నుండి గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆశ, అంగన్వాడి కార్యకర్తలు అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. వ్యవసాయ, పశు సంపద నీటి వనరులు తదితర అంశాలను కేంద్రీకృతం చేసి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ దత్తుమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, తాహశీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారిణి పల్లవి, సిడిపిఓ తిరుపతమ్మ, ఎంఈఓ అంజయ్య, ఏవో వినయ్, ఎంపిఓ ప్రశాంత్, ప్రోగ్రాం ఆర్గనైజర్ బాలరాజ్, సూపరిడెంట్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ డెవిడ్



## మంత్రిపై విమర్శలు సిగ్గుచేటు: కాంగ్రెస్ నేతల మండిపాటు

**మందమర్రి, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త:**

మందమర్రిలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కార్మిక–గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, నాయకులు పైడిమల్ల నర్సింగ్‌లు విలేకరులతో మాట్లాడుతూ, క్యాతనపల్లి చైర్‌పర్సన్ ఎంపిక విషయంలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో తమకు 14 మంది కౌన్సిలర్లు ఉన్నారని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు, చైర్మన్ పదవి తమకే వస్తుందనే నమ్మకం ఉంటే భయపడాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య పరమైన హక్కు అని పేర్కొన్నారు. తమకు వచ్చిన సమాచారం ప్రకారం బీఆర్ఎస్ వర్గానికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లను బెదిరించి నిర్బంధించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో క్యాతనపల్లి ఫ్లైఓవర్ వద్ద మంత్రి వాహనం, పోలీసుల వాహనాలు, కాంగ్రెస్ కార్యకర్తలపై రాళ్ల దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. దాడిలో కాంగ్రెస్ నాయకులు, పోలీసులకు గాయాలు అయినట్లు పేర్కొంటూ, బీఆర్ఎస్ నాయకులకు గాయాలేమీ కాలేదని అన్నారు. ప్రజలను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, మంత్రి ఒంటరిగా లేరని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా ఆయన వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. ఇకముందు కూడా అనవసర ఆరోపణలు కొనసాగితే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

**జైపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

జైపూర్ మండలం ముదిగుంట గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఆకుల రవికుమార్ డ్రైనేజీ పనులు మంగళవారం ప్రారంభించారు. ముదిగుంట గ్రామ పంచాయతీ బోడగూడెంలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పత్తి సంధ్య రాణి, వార్డు సభ్యులు గోగు భాగ్యలక్ష్మి, తిమోతి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పెద్దలతో సర్పంచ్ ఆకుల రవి

## విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి: ఎంపీడీఓ సత్యనారాయణ

**జైపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

విద్యార్థులు పరీక్షల సమయం లో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా, పరీక్షలు రాయాలని జైపూర్ మండల అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయాన్ని, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను సందర్శించారు. పాఠశాలల్లో వంటగది, ముడి సరుకులను, ఆహారాన్ని తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శానిటేషన్, డైనింగ్ హాల్ మరమ్మతుల పనులను పరిశీలించారు. అదే విధంగా ఇందారం, రామారావు పేట గ్రామాల్లో జరుగుతున్న ట్రెంచ్ పనులను పరిశీలించారు. అలాగే ఇందారం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించి ఇంటి నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న ఏఐ బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇంటర్, పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి అవసరమైన సహాయ, సహకారాలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏపీఓ, తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక వ్యవసాయ యంత్రాలతో అధిక దిగుబడులు సాధించాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్

**తిర్యాని, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

రైతులు ఆధునిక వ్యవసాయ యంత్రాలను ఉపయోగించి ఖర్చు తగ్గించుకొని, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ కోరారు. మంగళవారం తిర్యాని మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ట్రాక్టర్ అనుబంధ పరికరాలు, రోటావేటర్లు, స్ప్రేయర్లతో పాటు ఇతర వ్యవసాయ పనులకు ఉపయోగపడే యంత్రాలను ప్రభుత్వ సబ్సిడీతో అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

# గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకం

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

నస్పూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామ స్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకమైనదని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిపిఓ/ఆర్ ఐ యాప్ పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తహసిల్దార్ మల్లికార్జున్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వి.ఆర్.ఓ., వి.ఆర్.ఏ.లుగా సేవలు అందించిన వారు గ్రామంలో జరిగే అన్ని విషయాలను ప్రభుత్వానికి అందించి ప్రజా సంక్షేమం కోసం చర్యలు తీసుకునేందుకు గ్రామ పాలన అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. గ్రామస్థాయిలో ధ్రువ పత్రాల జారీ, లబ్ధిదారుల ఎంపిక జిపిఓల ద్వారా చేయడం జరుగుతుందని తెలిపారు. కులం, ఆదాయం ఇతర ధ్రువపత్రాల కొరకు మీ సేవా ద్వారా అందిన దరఖాస్తులను యాప్ ద్వారా పరిశీలించి పరిష్కరించవచ్చని, తద్వారా సమయం ఆదావుతుందని, పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, గత అనుభవం దృష్ట్యా రికార్డులపై గ్రామ పాలన అధికారులు అవగాహన కలిగి ఉన్నారని, ఈ మేరకు సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని, పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. గ్రామస్థాయిలో సర్వేయర్ కు సహాయకులుగా వెళ్లవలసి ఉంటుందని, తద్వారా గ్రామ సంబంధిత భూములపై అవగాహన పొందుతుందని, గ్రామ పాలన అధికారులు తమ విధులు, అధికారాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విరాసత్, ముటేషన్ల విషయంలో మోకా మీద విచారణ జరపాలని సూచించారు. విధుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాఘవేంద్ర కరిమల కళాశాల విద్యార్థి ప్రతిభ

జన్నారం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

సీఎం కప్ పోటీలో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి కొట్టే అభిషేక్ ప్రతిభ కనబరిచి రెండవ బహుమతి గెలుచుకున్నారు. ఇటీవల జరిగిన మండల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ కొట్టే అభిషేక్ ను అభినందిస్తూ పిల్లలకు ఇలాంటి కలలు ఎంతో అవసరమని ముందు క్రీడల్లో ఇంకా రాణించి మరెన్నో కప్పులు గెలవాలని అలాగే కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, డీన్ హేమలత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎనిమిది నెలల గర్భంతోనూ బెల్లంపల్లి వార్డు కౌన్సిలర్ సేవలు

**బస్తీల్లో చెత్త తొలగింపును స్వయంగా పర్యవేక్షిస్తున్న ప్రసన్న-వెంకటేష్**

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



బెల్లంపల్లి మున్సిపాలిటీలో నూతనంగా గెలుపొందిన మొదటి వార్డు కౌన్సిలర్ కొయ్యాడ ప్రసన్న-వెంకటేష్ ప్రజాసేవలో తన కర్తవ్య నిబద్ధతను చాటుకుంటున్నారు. ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు బస్తీ వాసులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని బస్తీలో నాలాలలో పేరుకుపోయిన చెత్తను స్వయంగా దగ్గరుండి తొలగింపజేస్తూ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. గర్భవతి అయినా కూడా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తున్న కౌన్సిలర్ ప్రసన్న-వెంకటేష్‌కు బస్తి వాసులు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆమె సేవా స్ఫూర్తి ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

## సింగరేణి అధికారుల సమస్యలపై సి.ఎం.ఓ.ఏ.ఐ వినతిపత్రం

మందమర్రి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా సి.ఎం.ఓ.ఏ.ఐ. అధ్యక్షుడు ఎస్. రమేష్ ఆధ్వర్యంలో ఇతర సభ్యులు మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ద్వారా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సి.అండ్.ఎం.డి.కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షుడు ఎస్. రమేష్ మాట్లాడుతూ, సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న అధికారులకు కోల్ ఇండియా లిమిటెడ్లో అమలు చేస్తున్న విధంగా పే అప్‌గ్రేడేషన్ వర్తింపజేయాలని కోరారు. అలాగే 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన పి.ఆర్.పి చెల్లింపులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడం, ఐఐటి/ఐఐఎం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడం, ప్రమోషన్లలో పారదర్శకత్వం పాటించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.ఓ.ఏ.ఐ వైస్ ప్రెసిడెంట్ ఎన్. వర్ధన్, జాయింట్ సెక్రటరీ రవి, ట్రెజరర్ సరిత, ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కిరణ్ కుమార్, భగవతి జా తదితరులు, మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న సి.ఎం.ఓ.ఏ.ఐ. అధ్యక్షుడు ఎస్. రమేష్

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

హాజీపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 16 వార్డు ముల్కల్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. లక్షెట్టిపేట నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు ముందు వెళుతున్న లారీని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. అదుపుతప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న ఇంటి ముందు గోడకు ఢీ కొట్టి ఆగిపోయింది. రోడ్డుపై, ఇంటి ముందు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు ప్రమాదానికి గురైనప్పుడు అందులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ తెచ్చుకోవడంతో కారు నడుపుతున్న డ్రైవర్ అందులో ఉన్న అతని కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

## ప్రమాదవశాత్తు చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

హాజీపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి పశువుల కాపరి మరణించిన సంఘటన టీకానపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం టీకన్ననపల్లి గ్రామానికి చెందిన మెడపట్ల పోచయ్య( 70) పశువుల కాపరిగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే ఈరోజు ఉదయం గేదెలు మేపుటకు టీకనపల్లి గ్రామ శివారులోకి వెళ్ళాడు. సాయంత్రం సమయంలో చెరువులో ఉన్న గేదెలను తోలుకు రావడానికి నీటిలోకి దిగగా, చెరువులో నీటి లోతు ఎక్కువగా ఉండడం వలన ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని కొడుకు మెడపట్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానం ఉన్నారు.



చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మున్సిపాలిటీ నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్మన్ మోతుక్కారి రాజేశ్వరి వెంకట స్వామి గౌడ్‌కి అలాగే కౌన్సిల్ సభ్యులు పర్వీన్ సుల్తానా ఆరిఫ్, పెండం పద్మ రాజు, తోట సువర్ణ రమేష్, శనిగారపు చిన్నయ్య, సూరం చంద్రమోళి, బోడ రాజేంద్రప్రసాద్, బిరుదుల సత్యనారాయణ లను లక్షెట్టిపేట కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు నవాబ్ ఖాన్, మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ శ్రీధర్ ఆధ్వర్యంలో స్వీకరించిన సభ్యులను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సమస్యలను ప్రణాళిక బద్ధంగా కార్యాచరణ రూపొందించి అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డు యూత్ నాయకుడు రియాజ్ ఖాన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఇంటర్మీడియట్ పరీక్షలు

**పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమలు - చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ వెల్లడి**

చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త




నేడు చెన్నూరు పట్టణంలో జరుగుతున్న ఇంటర్‌మీడియేట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో బుధవారం నుండి ఇంటర్‌మీడియెట్ పరీక్షలు ఉన్నందున పరీక్షాకేంద్రాలవద్ద 163 బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, పరీక్ష కేంద్రం నుండి 200 మీటర్ల దూరంలో జిరాక్స్ సెంటర్లు ఎగ్జామ్ పూర్తి అయ్యేవరకు తెరవరాదనీ తెలిపారు. మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించబడవని తెలిపారు. ఎగ్జామ్స్ రాసే ఇంటర్మీడియట్ విద్యార్థులు 30 నిమిషాల ముందుగానే సెంటర్ కు చేరుకోవాలని సూచించారు. ఎగ్జామ్ సెంటర్ పరిసర ప్రాంతాలలో ఎవరు ఉండకూడదని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇట్టి నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కరించాలని

# ఈడి ద్వారా సీ అండ్ ఎండికి వినతి

**జైపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మంగళవారం సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో సంస్థ సీఎండీ బుద్ధా ప్రకాష్ జ్యోతికి అధికారుల సమస్యలపై రాసిన వినతి పత్రాన్ని ఈడి సిహెచ్. చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా సీ.ఎం.ఓ.ఏ.ఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా మాట్లాడుతూ అధికారులకు సంబంధించిన అనేక సమస్యలు గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. సీ అండ్ ఎండీ బుద్ధా ప్రకాష్ జ్యోతి తక్షణమే జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కోల్ ఇండియా అధికారులతో సమానంగా సింగరేణి అధికారుల వేతన పెంపుదల అమలు చేయాలని, పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్.సి.డబ్ల్యూ.ఏ కార్మికుల పిల్లలు ఐఐటి / ఐఐఎంలో సీటు పొందితే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ ప్రోత్సాహం అందజేస్తుండగా, సింగరేణి అధికారుల పిల్లలకు చేయూతనివ్వడం లేదన్నారు. సింగరేణి అధికారుల పిల్లలు ఐఐటీ / ఐఐఎంలో సీటు పొందితే వారికీ ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కోల్ ఇండియా అధికారులతో సమానంగా సెల్ ఫోన్ రీయింబర్స్‌మెంట్ టి.ఏ అండ్ డి.ఏ నియమాలు సవరించి అన్ని ప్రయోజనాల అందజేయాలని కోరారు. అధికారుల బదిలీలు, ప్రమోషన్ కి సంబంధించిన ఒక పారదర్శక విధానాన్ని రూపొందించాలన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం అధికారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ అండ్ ఎం జి.ఎం. నరసింహారావు, ఫైనాన్స్ డీ.జి.ఎం శ్రీధర్, 800 మెగావాట్ల కో ఆర్డినేటర్ వేణుగోపాల్, సీ.ఎం.ఓ.ఏ.ఐ వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, జనగామ శ్రీనివాస్, సీ.ఎం.ఓ.ఏ.ఐ సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడికి వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి అధికారులు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మర్సకోల సరస్వతీ

## ఎమ్మెల్యేపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ఎమ్మెల్యే కోవలక్ష్మీపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మర్సకోల సరస్వతీ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ పదవికి బిఆర్ఎస్ కు స్పష్టమైన మెజారిటీ ఉన్నా చైర్మన్ ఎన్నికలు జరగకుండా అధికార పార్టీ మంత్రిబిఆర్ఎస్ నాయకులైన బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మీపై తప్పుడు కేసులు పెట్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయుటకు ప్రయత్నించిన వారిని నిలువరించి కౌన్సిలర్లను కార్యాలయానికి తీసుకెళ్తున్న ఎమ్మెల్యేపై రామకృష్ణపూర్ పోలీసులు అడ్డుకొని అక్రమంగా కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ బిడ్డపై పెట్టిన కేసును ఎత్తివేయకుంటే ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. క్యాతన్పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, మిత్రపక్షానికి 14 స్థానాలతో ప్రజలు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం శిరసావహించి ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సుంగే బాలకృష్ణ, సాయి శ్రావణ్, సాలం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జబరి రవీందర్, టౌన్ అధ్యక్షులు హైమద్, గుండి ఉప సర్పంచ్ సంతోష్, అచల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హివ్రే సందీప్, మాజీ సర్పంచ్ బండే తుకారాం తదితరులు పాల్గొన్నారు

## వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించండి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ అర్థమయ్యే రీతిలో పాఠాలు భోదించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు(బాలికలు), సిర్పూర్ లోని ఈఏంఆర్ఎస్ కళాశాల(బాలురు), కాగజనగర్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల(బాలురు) ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా.. సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా.....మెనూ ప్రకారంగా అందిస్తున్నారా... భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాటలను బోధించారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచిని చూశారు. అదేవిధంగా కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి ఐటీడీఏ పల్స్ యాప్ పనితరుపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు 100 ఉతీర్ణత వచ్చే విధంగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు, ఈఏంఆర్ఎస్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ తో చదువుని ఆపకూడదని, ఐఐటి, జేఈఈ మెయిన్ వంటి ఉన్నత విద్యలు చదవాలని ఆకాంక్షించారు. పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్యాకింగ్‌పై తేదీని పరిశీలిస్తున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు

**- సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు**

**- బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ కె. శ్రీనివాస రావు**

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని బెల్లంపల్లి 1 టౌన్ సీఐ కె. శ్రీనివాస రావు తెలిపారు. పట్టణ పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి పట్టణ పరిధిలోని మొత్తం పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగడం నిషేధం. పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, విద్యార్థులు పరీక్ష సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోండి. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల పై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ పోటీలలో మందమర్రి విద్యార్థుల ప్రతిభ

**- విజేతలకు మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానం**

**మందమర్రి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ-కరాటే పోటీలలో స్థానిక విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించారు. ఈ విషయాన్ని మాస్టర్ జెట్టి కృష్ణ, మాస్టర్ హరికృష్ణ వెల్లడించారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు సోమవారం సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ రాయలింగు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలోనూ రాణించడం అభినందనీయమని, చిన్న వయసు నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని కృషి చేస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం మాస్టర్ జెట్టి కృష్ణ మాట్లాడుతూ, కుంగ్ ఫూ-కరాటే వంటి యుద్ధ కళలు నేర్చుకోవడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా మారడంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన మాస్టర్ జెట్టి కృష్ణను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- డాక్టర్‌క కొత్తపల్లి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :**

కొత్తపల్లి వెంకటలక్ష్మి – చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ కొత్తపల్లి అనిత అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో ని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి – చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి 18 మంది హాజరు కాగా వారిలో 8 మందికి శస్త్రచికిత్స అవసరమని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధులను అధైర్య పడవద్దని, లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్ లు చేపిస్తామని తెలిపారు. ఈ ఉచిత కంటి శిబిరం ప్రతి మంగళవారం నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని ప్రజలందురూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్చార్జి గోపి పాల్గొన్నారు



కంటి వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు